క్లుప్తంగా

ప్రజలే స్పందించారు..



మండలమ్మతల్లి సమీపంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సరుబుజ్జిలి: రొట్టవలస నుంచి పురుషోత్త పురం వరకు గల ఆర్అండ్బీ రహదారిలో పురుషోత్తపురం గ్రామస్తులు స్పందించి పలు చోట్ల ఆదివారం ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. రహదారికి ఇరువైపులా పలు చోట్ల గుబురుగా ఉన్న పొదలను తొలగించారు. ఈ రహదారిలో గత 6 నెలలుగా జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని తమవంతు ప్రయత్నం చేసినట్లు గ్రామ యువకులు తెలిపారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు



స్థల పరిశీలన చేస్తున్న ఏఈ రవికుమార్

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్ అన్నారు. మండలంలో కొత్తరోడ్డు వద్ద ఏర్పాటు చేయనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఆదివారం స్థల పరిశీలన చేశారు. వేసవి నేపథ్యంలో ఎక్కువ ఏసీలు, ఫ్రిజ్‌లు వాడకం వల్ల ట్రాన్స్‌ఫార్మర్‌లు లోడు సరిపోక ఫీజులు కాలిపోతున్నాయన్నారు. మూడు ప్రాంతాల్లో 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, దీనికోసం స్థలం ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. సీనియర్ లైన్‌మన్ తమ్మినేని కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో డైరెక్టర్‌కు అభినందన



గోవిందరావును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బూర్జ: మండలంలోని మదనాపురం గ్రామానికి చెందిన ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావును ఓ.వి.పేట హైస్కూల్ ఉపాధ్యాయులు గేదెల గోవిందరావు దంపతులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. గోవిందరావును సంస్కృత పండితులు, పౌరాణిక కళాకారులు, గ్రంథాలయశాఖ ఉద్యోగి బి.గణేష్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

200 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సురేష్

ఆమదాలవలస రూరల్: వేసవిలో వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సన్‌రైజ్ ఆస్పత్రి వైద్యాధికారి బొడ్డేపల్లి సురేష్ అన్నారు. మండలంలోని తోటాడ గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 200 రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వేసవిలో ఎక్కువగా ప్రజలు ద్రవపదార్థాలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లోనే బయట రావాలన్నారు. వేసవిలో వైరల్ జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రూ.20 వేల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ గ్రామానికి చెందిన పల్ల రాము, తండ్రి దానయ్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. తండ్రీకొడుకుల వైద్య ఖర్చుల నిమిత్తం మండలంలోని కుంటిభద్ర గ్రామానికి చెందిన భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు రూ.20 వేల నగదును కర్లెమ్మ గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ప్రస్తుతం శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో తండ్రీకొడుకులు వైద్యం పొందుతున్నారు. పలువురు దాతలు అందజేసిన విరాళాలను బాధితులకు అందజేసినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు.

ఎస్ఐకి సన్మానం

పోలాకి: పోలాకి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన నర్సింహమూర్తికి ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది సన్మానం చేశారు. నరసన్నపేట సీఐ రాము, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు ఈ కార్యక్రమంలో హాజరయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ సత్యనారాయణకు సిబ్బంది స్వాగతం పలికారు.

- ఖరీఫ్ వరిసాగుకు సిద్ధం
- జగనన్న సాయం.. సాగుకు ఊతం
- ముమ్మరంగా పొలం పనులు చేస్తున్న రైతన్నలు
- రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో విత్తనాలు



ఖరీఫ్ వరి వెదలు వేసుకునేందుకు గట్లు బాగు చేస్తున్న రైతులు

రైతు భరోసాతో.. పెట్టుబడి సాయం



ఎల్.ఎన్.పేట: ఈయన పేరు పల్లి అప్పల నాయుడు, దబ్బపాడు గ్రామానికి చెందిన రైతు, ఈయనకు వ్యవసాయమే జీవనాధారం. భార్యాభర్తలు వ్యవసాయం పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ప్రతీ ఏడాది ఖరీఫ్ వరిసాగు సీజన్ ప్రారంభంలో (జూన్, జూలై) విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు వడ్డీలకు అప్పులు తీసుకునేవారు. పంట పండిన తరువాత అప్పులు తీర్చేవారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తరువాత వడ్డీకి అప్పులు తీసుకునే బాధ తప్పింది. పెట్టుబడి సాయంగా జగనన్న రూ.5,500 ఇస్తున్నారు. మోడీ రూ.2వేలు ఇస్తున్నారు. మొత్తం డబ్బులతో విత్తనాలు, ఎరువులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. కష్టపడి పనిచేసుకుని పంట పండిస్తున్నామని సంతోషాన్ని వ్యక్తం చేశారు. – పల్లి అప్పలనాయుడు

వరి విత్తనాల రకాలు..

ఈ ఏడాది ఖరీఫ్ వరిసాగుకు అవసరమైన విత్తనాలు వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేశారు. బీపీటీ 5204 (సాంబ), బీపీటీ 3291 (సోనా మసూరి), ఎంటీయూ 7029 (స్వర్ణ), ఎంటీయూ 1121 (శ్రీవిద్య), ఎంటీయూ1156 స్వల్పకాలిక), ఎంటీయూ 1061, ఆర్‌జీఎల్ 2537 (సీఆర్), ఎంటీయూ 1224,



పంపిణీకి సిద్ధంగా ఉన్న విత్తనాలు

ఎంటీయూ 1064 (ఇంద్ర) తదితర రకాల విత్తనాలు కావాలని ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటికే కొన్ని రకాల విత్తనాలు రైతు భరోసా కేంద్రాలకు చేరుకున్నాయి. విత్తనాల పంపిణీని ప్రారంభించామని వ్యవసాయశాఖ అధికారి పైడి లతశ్రీ తెలిపారు.

సాగునీటి వనరులు..

పాతపట్నం నియోజకవర్గంలో ఖరీఫ్ వరిసాగు చేసేందుకు మహేంద్రతనయ, వంశధార నదులున్నాయి. మెళియాపుట్టి, పాతపట్నం, హిరమండలం మండలంలో కొంత భాగాన్ని మహేంద్రతనయ నది, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల్లో పంటలకు వంశధార నది నుంచి సాగునీరు అందుతుంది. వంశధార నుంచి ఏర్పాటు చేసిన కుడి, ఎడమ కాలువలతోపాటు కొండ వాగు గెడ్డలు, చెరువుల నుంచి సాగునీరు అందుతుంది.

పాతపట్నం నియోజకవర్గంలో ఖరీఫ్‌కు సిద్ధం చేస్తున్న భూములు, రైతుల వివరాలు..

మండలం	రెవెన్యూ గ్రామాలు	సాగుభూవి ఎకరాల్లో
ఎల్.ఎన్.పేట	47	10,850
మెళియాపుట్టి	70	23,500
పాతపట్నం	49	18,500
కొత్తూరు	27	20,900
హిరమండలం	40	06,650

నియోజకవర్గంలో రైతు భరోసా నిధులు (ఇటీవల జమ అయినవి)

మండలం	రైతులు	రైతు భరోసా నిధులు (రూ.లక్షల్లో)
కొత్తూరు	10,961	244.90
మెళియాపుట్టి	9,597	233.08
పాతపట్నం	9,183	225.22
ఎల్.ఎన్.పేట	5,897	134.88
హిరమండలం	5,548	137.50

కొద్దిపాటి వానలు కురిసినా సాగునీటికి ఇబ్బంది ఉండదు.

రేపటి నుంచి రథయాత్ర

నరసన్నపేట: స్థానిక పెద్దపేట కూడలిలో మంగళవారం నుంచి రథయాత్ర నిర్వహిస్తున్నారు. వేంకటేశ్వరాలయంలో కూడా రథయాత్ర సందర్భంగా 9 రోజులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అలంకరణ చేపట్టనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. సత్యవరంలోని జగన్నాథ స్వామిని ఊరేగింపుగా పెద్దపేట కూడలికి తీసుకువెళ్లి అక్కడి ఆలయంలో 9 రోజులు ఉంటారు. ఈ సందర్భంగా యాత్ర జరుగుతుంది. రథాన్ని సిద్ధం చేస్తున్నామని అర్చకులు వనమాలి గాంధీ తెలిపారు.

అవలింగిలో..

సారవకోట: మండలంలోని అవలింగి గ్రామంలోని జగన్నాథ స్వామి ఆలయంలో మంగళవారం నుంచి రథయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక వైశ్యులు నిర్మించిన పురాతనమైన ఆలయంలో ప్రతిఏటా ఈ ఉత్సవాలు ఒడిశాలోని పూరిలో నిర్వహించే రోజునుంచి ఇక్కడ కూడా ప్రారంభిస్తారు. ఆదివారం స్వామి వారి కల్యాణం నిర్వహించి మంగళవారం నుంచి ఈ యాత్రా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక గుడించా మందిరంలో స్వామి వారిని తరలించి అక్కడ 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తిరువీధి నిర్వహించేందుకు రథాన్ని సిద్ధం చేస్తున్నారు.

హిరమండలంలో..

హిరమండలం: స్థానిక జగన్నాథ ఆలయంలో రథయాత్ర మంగళవారం నుంచి నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. రథానికి రంగులు వేశారు. విద్యుద్దీపాలంకరణలు చేశారు. తొమ్మిది రోజులపాటు స్వామివారు రోజుకో రీతిలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 28న జరిగే మారు వారంతో రథయాత్ర ముగుస్తుందన్నారు. భక్తులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.

వైభవంగా జగన్నాథస్వామి కల్యాణం



జగన్నాథస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సారవకోట: మండలంలోని జగన్నాథస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం నుంచి రథయాత్ర పురస్కరించుకుని ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో ఆలయ పురోహితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

నీట్ విద్యార్థులకు అభినందన



జాహ్నవిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ఇటీవల విడుదలైన నీట్ 2023 ఫలితాల్లో పాతపట్నం మండల కేంద్రానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించడంతో వారిని ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం అభినందించారు. పాతపట్నం యశోధనగర్‌కు చెందిన కాని యశశ్రీ ఆల్ ఇండియా 40వ ర్యాంకు, గణేష్‌నగర్‌కు చెందిన యాబాజీ జాహ్నవి 274వ ర్యాంకు సాధించారు. విద్యార్థుల ఇళ్లకు ఎమ్మెల్యే వెళ్లి సత్కరించారు. వైస్ ఎంపీపీ ప్రదీప్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫాదర్స్ డే



కేక్ కట్ చేస్తున్న ఉపహార్ ఏరియా మేనేజర్

పొందూరు: మండలంలోని లోలుగు ఉపహార్ ప్రాజెక్టు చైల్డ్ డెవలప్‌మెంట్ సొసైటీలో ఘనంగా ఫాదర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల తండ్రులను బోకేలతో ఆహ్వానించారు. ఉపహార్ ఏరియా మేనేజర్ బీఎం పాల్ కేక్‌ను కట్ చేసి పంచారు. పిల్లల పట్ల బాధ్యతగా ఎలా వ్యవహరించాలో చర్చించుకున్నారు. ఉపహార్ కోఆర్డినేటర్ ఏసుదాసు, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ లోపింటి అప్పారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కామేశ్వరిపేటలో గడపగడపకు మన ప్రభుత్వం

నరసన్నపేట: మండలంలోని కామేశ్వరిపేటలో సోమవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నామని ఎంపీపీ ఆరంగి మురళి ఆదివారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. అలాగే నరసన్నపేటలోని పోలాకి రోడ్డులో గల కల్యాణ మండపంలో నూతనంగా ఎంపికైన అంగన్‌వాడీ కార్యకర్తలకు నియామకపత్రాలు పంపిణీ కార్యక్రమం ఉదయం నిర్వహిస్తామని తెలిపారు.

పుస్తకావిష్కరణ..

పాతపట్నం: మండలంలోని పెద్దసీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొల్లి లక్ష్మీనారాయణ రచించిన ఎసెన్షియల్ ఎక్స్‌ప్రెషన్ ఇన్ ఇంగ్లిష్ పుస్తకాన్ని వ్యాపారవేత్త సిరిపురం తేజేశ్వరరావు ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక బ్రాహ్మణవీధిలో ఉన్న కేఎస్ఎం ప్లాజాలో పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. పాతపట్నం మోడల్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చక్రపతి, రిటైర్డ్ ఎంఈఓ పి.ఎన్.దాసునాయుడు, హెచ్ఎం ఎస్.కుమారస్వామి, బి.శ్రీధర్, ఎ.మధుబాబు, ధనుంజేయరావు, వేణుగోపాలరావు, బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరామర్శ..



అల్లు సోదరులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు అల్లు కృష్ణారావు, శంకరరావుల తండ్రి రామారావు ఇటీవల మృతి చెందారు. దుర్బలాపురంలోని ఆ కుటుంబాన్ని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకటరామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి అవస్థలు

సరుబుజ్జిలి: మండలంలోని వ్యాసులుపేట గ్రామానికి జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయి పనులు ఇదివరకే పూర్తిచేశారు. లక్ష రూపాయలకు పైబడి వెచ్చించి బోరు తీయగా ఫ్లోరైడ్ వాటర్ రావడంతో దాన్ని అధికారులు పక్కన పెట్టేశారు. మరో 500 మీటర్లు దూరంలో మరలా ప్రభుత్వ నిధులు వెచ్చించి మరో బోరు ఏర్పాటు చేశారు. గ్రామానికి సుదూరంగా బోరు ఉండటం వల్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో జాప్యం చోటు చేసుకోవడంతో గ్రామస్తులకు తాగునీటిని అందించలేని పరిస్థితులున్నాయి. 200 జనాభాకు ఒకే ఒక్కబోరు ఉన్నప్పటికీ ఆ నీరు ఫ్లోరైడ్ కావడం వల్ల ప్రస్తుత వేసవి సీజన్‌లో తాగునీటికి అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. ఇదే విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పూర్ణమ్మ వద్ద ప్రస్తావించగా.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సంబంధించి రూ.2 లక్షల నిధులు అవసరం కావడంతో జిల్లా అధికారుల అనుమతులు కోసం పంపించామన్నారు. నిధులు మంజూరైన వెంటనే తాగునీటి సరఫరా ప్రారంభిస్తామన్నారు.

నేటినుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఆమదాలవలస: ఆమదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం అవుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎస్.ఎన్. స్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు కళాశాల, గ్రూప్‌లకు ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

రెండో ఎంఈఓగా షణ్ముఖరావు



హిరమండలం: మండల ఎంఈఓ–2 గా తూలుగు షణ్ముఖరావు నియమితులయ్యారు. ఇటీవల ప్రభుత్వం పాలనలో భాగంగా రెండో ఎంఈఓ నియామక ప్రక్రియ చేపట్టిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా రేగిడి ఆమదాలవలస ఎమ్మార్సీలో పనిచేశారు. ఆయన్ను రెండో ఎంఈఓగా నియమిస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీచేశారు. ఒకటి రెండురోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

భక్తిశ్రద్ధలతో నీలమ్మతల్లి 26వ వార్షికోత్సవం



అమ్మవారికి ఘటాలను సమర్పిస్తున్న భక్తులు

సరుబుజ్జిలి: మండలంలోని మతలబుపేట గ్రామంలో గల నీలమ్మతల్లి పేరంటాల 26వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామంలోని మహిళలంతా కలిసి ఘటాలతో ముర్రాటలు సమర్పించారు. అమ్మవారికి కుంకుమ పూజలు, అర్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ పూజల్లో పలు గ్రామాల భక్తులు భారీగా పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ప్రజలవద్దకే పాలన



పోలాకి: సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

పోలాకి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుచేసిన సచివాలయవ్యవస్థతో ప్రజలవద్దకే పాలన వచ్చిందని మాజీ డిప్యూటీ సీఎం, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. అంపలాం గ్రామంలో స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వ్యాపార ధర్మారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అర్హతవుంటే వలంటీర్లే నేరుగా ఇంటికి వచ్చి సచివాలయం ద్వారా పథకాలను అందజేసేలా సీఎం జగన్ ఏర్పాట్లు చేశారన్నారు. పార్టీలు, ప్రాంతాలు, రాజకీయాలు చూడకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, పార్టీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ, పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, నాయకులు రెంటికోట త్రినాథరావు, మూర్తి, నూకరాజు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పాతపట్నం: నాలుగేళ్లలో ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా చేకూర్చిన ప్రయోజనాన్ని ప్రజలకు తెలియజేయాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని తిడ్డిమి, సూర్యానారాయణపురం గ్రామాల్లో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అడిగి తెలుసుకుంటూ.. ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నారు. ప్రజలనుంచి సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులకు చేకూర్చిన ప్రయోజనాన్ని వివరిస్తూ సీఎం జగన్ రాసిన లేఖను ఆ కుటుంబాలకు అందజేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్ సుందరావు, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, సచివాలయ మండల కన్వీనర్ వై.సూర్యం, వైస్ ఎంపీపీఎస్ ప్రదీప్, ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ బి.ప్రసాద్, ఏపీఎం మనోరత్నం, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా, పార్టీ మండల నాయకులు తూలుగు ప్రవీణ్, నాగరాజు, కర్రి లక్ష్మీనారాయణ, రాము, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాతపట్నం: సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పవన్ పొలిటికల్ కమెడియన్

- వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: జనసేన అధినేత పవన్ కల్యాణ్ సినిమారంగంలో హీరో అని, పొలిటికల్‌గా కమెడియన్‌గా మారాడని, ఎప్పటికీ నాయకుడు కాలేడని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలసలో జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవికుమార్ మాట్లాడారు. 2013 నుంచి ఇప్పటివరకు పవన్ రాజకీయమంతా ప్యాకేజీల చుట్టూ తిరిగిందన్నారు. సినిమా షూటింగ్ విరామంలో వారాహి యాత్ర పేరుతో రోజుకో మాట మాట్లాడుతున్నాడని అన్నారు. ఒక్క అవకాశం ఇవ్వండి అన్న పవన్ కల్యాణ్.. ముందుగా సినీరంగంలో ఉన్న తన 19 మంది కుటుంబ సభ్యులందరితో సినిమాల నుంచి విరమణ చేయించాలని, ఒక్క అవకాశం కోసం ఎదురు చూస్తున్న ఎందరో యువకులకు అవకాశం కల్పించాలన్నారు. అప్పుడు ప్రజల్లోకి వచ్చి ఒక్క అవకాశం అని అడిగితే అర్థం ఉంటుందన్నారు. పవన్ డ్రామాలన్నీ తను అంటే గుండెల్లో పెట్టుకుని అభిమానిస్తున్న జనసైనికులను మోసం చేయటమేనన్నారు. పార్టీ నాయకులు కొప్పల ఈశ్వరరావు, పుచ్చ రాజారావు, గురుగుబెల్లి భాస్కరరావు, చింతాడ రాఘవేంద్ర, పేడాడ సంతోష్ పాల్గొన్నారు.

యాంత్రీకరణ సాగుతో అధిక దిగుబడులు



సీడ్ డ్రిల్ యంత్ర ప్రదర్శనను తిలకిస్తున్న రైతులు

సరుబుజ్జిలి: వ్యవసాయంలో యాంత్రీకరణ పద్ధతుల్లో సాగుచేస్తే మంచి దిగుబడులు వస్తాయని రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ హరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని పాతపాడు గ్రామంలో పెట్టీకమ్ సీడ్ డ్రిల్ (యంత్రాలతో ఒకేసారి ఎరువులు, విత్తనాలు) విధానం గురించి రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్షేత్రస్థాయి ప్రదర్శనను ఆదివారం ప్రారంభించారు. వ్యవసాయంలో యంత్రీకరణ వలన కూలీల కొరత, పెట్టుబడి ఖర్చు, సమయం ఆదా అవుతుందన్నారు. ఫౌండేషన్ ఏరియా మేనేజర్ తవిటినాయుడు, కో ఆర్డినేటర్లు లావణ్య, రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

శ్రేయా మిశ్రోకు కళాశ్రీ జ్యోతి అవార్డు



శ్రేయా మిశ్రోకు అవార్డు, మెమోంటో అందజేస్తున్న నిర్వాహకులు

పాతపట్నం: భువనేశ్వర్ (ఒడిశా)లోని రవీంద్ర మండప్‌లో ఆదివారం జరిగిన అంతర్జాతీయ సంగీత నృత్య సంబరాల కార్యక్రమంలో పాల్గొని నృత్యప్రదర్శన చేసిన పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన శ్రేయా మిశ్రో (దివ్యాంగురాలు) కళాశ్రీ జ్యోతి అవార్డు అందుకుంది. భరతనాట్యం, కూచిపూడి, జానపదం విభాగాల్లో పలువురు నృత్యప్రదర్శన పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో శ్రేయామిశ్రో చేసిన నృత్య ప్రదర్శన (ప్లేట్ డాన్స్) అందర్నీ ఆకట్టుకుంది. నిర్వాహకులు డాక్టర్ ఉపేంద్ర నాయక్ శర్మ చేతులమీదుగా అవార్డు, మెమోంటో అందించారు. ఉషోదయ కూచిపూడి కళానికేతన్ నాట్య గురువు అర్చన ఉషశ్రీ, తదితరులు పాల్గొన్నారు.